- వచ్చే ఎన్నికల్లో గెలుపు మనదే
- 2018 మెజార్టీని మించి రావాలి
- ఎంపీ అర్వింద్‌తో రాజకీయాలు కలుషితం
- ఎమ్మెల్సీ ఎల్ రమణ
- అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సారే రావాలి
- జగిత్యాల అసెంబ్లీ నియోజకర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్ రమణ
- జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్ మండలాల బూత్ కమిటీల సమావేశం

# జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర



మాట్లాడుతున్న జగిత్యాల నియోజకవర్గ ప్రచార ఇన్‌చార్జి రమణ

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 31: 'బీఆర్ఎస్‌కు ఎన్నికలు కొత్త కాదు. ఎప్పుడైనా.. ఎక్కడైనా గెలుపు మనదే. వచ్చే ఎన్నికల్లోనూ జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలవుతుంది. 2018లో వచ్చిన 60వేల ఓట్లకు మించిన మెజార్టీతో డా. సంజయ్‌ను గెలిపించి సీఎంకు కానుకగా ఇవ్వాలని' జగిత్యాల అసెంబ్లీ నియోజకర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్. రమణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్స్‌లో నిర్వహించిన జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల బూత్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ మంత్రి రాజేశంగౌడ్, ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి హాజరై, మాట్లాడారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలు, అభివృద్ధి దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు గాంచాయన్నారు. చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చామని, దక్షిణ భారత దేశంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టిస్తామన్నారు. ప్రతి ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలు హామీలు ఇచ్చి మరిచారని, ఇప్పుడూ అలాగే జరుగుతుందన్నారు. దొంగ హామీలతో గెలిచిన ఎంపీ అర్వింద్ మాటలు, చేష్టల వల్ల రాజకీయాలు కలుషితమయ్యాయని, అటువంటి నాయకుడికి రాజకీయాల్లో స్థానం లేదన్నారు.

### ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి: ఎమ్మెల్యే సంజయ్

అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం కేసీఆరే మళ్లీ రావాలని, వచ్చే 30 రోజులు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ సూచించారు. పదేండ్లలో మన ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, అందచేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా బూత్ కమిటీలకు మాజీ మంత్రి రాజేశంగౌడ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దిశానిర్దేశం చేశారు. ఇక్కడ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. చంద్రశేఖర్‌గౌడ్, పార్టీ మండలాల అధ్యక్షుడు బాల ముకుందం, సురేందర్‌రావు, జడ్పీటీసీ మహేశ్, ఎంపీపీలు రాజేంద్ర ప్రసాద్, ములాసపు లక్ష్మీ, ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్‌రావు, ప్యాక్స్ చైర్మన్‌లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, రైతు బంధు సమితి నాయకులు నక్కల రవిందర్‌రెడ్డి, కట్ట రాజేందర్, జుంబర్తి శంకర్, మాజీ జడ్పీటీసీ ఎల్లారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు సర్పంచ్ రూ.50వేల విరాళం

జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో జగిత్యాల మండలం నర్సింగాపూర్ సర్పంచ్ సరోజన మల్లారెడ్డి దంపతులు ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్‌కు ఎన్నికల ఖర్చు నిమిత్తం రూ. 50వేల చెక్కును అందచేశారు.



హాజరైన బూత్ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# పనిచేసే వారికి తగిన గుర్తింపు

- హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్



హుజూరాబాద్‌టౌన్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, పక్కన బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 31: బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ వెన్నుపోటు పొడిచే కొందరు నాయకులు ఇప్పటికైనా తమ ప్రవర్తన మార్చుకోవాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ హితవుపలికారు. పార్టీ పటిష్టత కోసం నేతలతో కలిసి పని చేసే వారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. మంగళవారం స్థానిక సిటీ సెంట్రల్ హాల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కొందరు పార్టీలో ఉంటూ ప్రతిపక్ష నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, అటువంటివారు పూర్తిస్థాయిలో వెళ్లినా పరవాలేదని, కానీ కోవర్టు రాజకీయం చేస్తే మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో కొందరు కోవర్టుల గురించి తమకు ఇప్పటికే పూర్తి సమాచారం ఉందని, వారి భవిష్యత్తు బాగుండాలంటే పార్టీకి విధేయులై పనిచేయాలని సూచించారు. బుధవారం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ముమ్మరం చేస్తారని, కార్యకర్తలు, నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడం హేయమైన చర్య అని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఏనాడూ ఇలాంటి నీచమైన సంప్రదాయం తెలంగాణలో లేదని, కొత్తగా కాంగ్రెస్, బీజేపీ నుంచి హత్యా రాజకీయాలు పుట్టుకు రావడం బాధాకరమన్నారు. దుబ్బాకలో బీఆర్ఎస్‌పై గెలువలేమనే అక్కసుతోనే ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇలాంటి దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇలాంటి దాడులకు ఫుల్ స్టాప్ పెట్టాలని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే బీఆర్ఎస్ పార్టీ తప్పక తగిన జవాబు ఇస్తుందని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు కల్లేపల్లి రమాదేవి, మారపల్లి సుశీల, కేసిరెడ్డి లావణ్య, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, నాయకులు మొలుగూరి ప్రభాకర్, విడపు రాజు, కొలిపాక సమ్మయ్య, మోరే మధు, తూర్పాటి శ్యామ్, పులుగు లతారెడ్డి, ప్రభావతిరెడ్డి, మొలుగూరి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# కమిషనరేట్‌లో గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ సమీక్ష



సమావేశంలో డీజీ, ఎస్ఐబీ ఐజీ, ఉన్నతాధికారులు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 31: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం రామగుండం పోలీసు కమిషనరేట్‌లో గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ ఎం విజయ్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని మావోయిస్టు ప్రభావిత పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులతో ఎస్ఐబీ ఐజీ టీ ప్రభాకర్‌తో కలిసి సమావేశమైన డీజీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛీనయ సంఘటనలు జరగకుండా మావోయిస్టు ప్రాంతాలోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత ప్రాంతాలు, క్లిష్టమైన పోలింగ్ లోకేషన్ ఏరియాల పోలింగ్ కేంద్రాలపై నిఘాతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణపై చర్చించారు. అంతకుముందు డీఐజీకి రామగుండం పోలీసు కమిషనర్ రెమో రాజేశ్వరి మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. ఇక్కడ పెద్దపల్లి, మంచిర్యాల్ డీసీపీలు చేతన, సుధీర్ కేకన్, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

# ఉద్యోగం పేరిట మోసగించిన సింగరేణి ఉద్యోగికి రెండేళ్ల జైలు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 31: రాజకీయ నాయకుల పలుకుబడితో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.50లక్షలు తీసుకొని మోసగించిన కేసులో కల్యాణ్‌నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి ఎరవెల్లి రమేశ్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ గోదావరిఖని ఒకటో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ దుర్గం గణేశ్ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం శివాజీనగర్‌కు చెందిన కారెంగుల నర్సయ్య రమేశ్ వద్ద ప్రైవేటు చీటి వేశాడు. ఈ క్రమంలో పరిచయం పెంచుకున్న రమేశ్ తనకు రాజకీయ నాయకుల అండ ఉందని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నర్సయ్యను నమ్మించాడు. తన కుమారుడు సతీశ్‌కు ఉద్యోగం పెట్టించాలని నర్సయ్య రమేశ్‌ను కోరాడు. ఇందుకు రూ. 5.50 లక్షలు ఖర్చు అవుతుందని, మొదటి విడుతగా రూ. 2.50 లక్షలు ఇవ్వాలని రమేశ్ తెలిపారు. దీంతో నర్సయ్య రమేశ్ భార్య చంద్రకళ బ్యాంకు ఖాతాలో వేశాడు. మిగతా రూ. 1. 50 లక్షలు రమేశ్‌కు ఇచ్చాడు. తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించకపోవడంతో నర్సయ్య డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగాడు. డబ్బులు ఇవ్వకపోగా రమేశ్ బెదిరింపులకు పాల్పడడతో నర్సయ్య అప్పటి గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ, ప్రస్తుతం సీపీఎస్ సీఐ ఎన్ దేవయ్యకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసుకున్న దేవయ్య విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం గోదావరిఖని ఏపీపీ నహీద ఫర్వీన్ ప్రాసిక్యూషన్ తరుపున వాదనలు వినిపించారు. ప్రస్తుత సీఐ ఎస్ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ ఎం అబీ, హోంగార్డు తిరుపతి కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతొ రమేశ్‌కు జైలుశిక్ష విధిస్తూ చేస్తు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194